సాక్షి ఖమ్మం

శుక్రవారం । 23 । మే । 2025



వైభవంగా హనుమజ్జయంతి

జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 9లో



ఫలరాజు ఫలించేలా..

ఫలరాజుగా పేరుగాంచిన మామిడి సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు పలు సూచనలు చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 10.30 గంటలకు వెంకటగిరి క్రాస్‌రోడ్డులో, 10.45 గంటలకు గాంధీచౌక్‌లో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11 గంటలకు 2వ డివిజన్ పాండురంగాపురంలో స్ట్రోమ్ వాటర్ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. శనివారం రఘునాథపాలెం మండలం కోటపాడులో కోయచలక – పాపటపల్లి దారిలో బ్రిడ్జి నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య




మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

బోనకల్: ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లు చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య సూచించారు. బోనకల్‌లో గురువారం మధిర డివిజన్ డీలర్ల సమావేశం నిర్వహించగా డీఏఓ మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. క్రమం తప్పకుండా లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడమే కాక పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీలర్లకు ఈపాస్ మిషన్లను అందించారు. కార్యక్రమంలో మధిర ఏడీఏ ఎస్.విజయచంద్ర, ఏఓలు వినయ్‌కుమార్, సాయిదీక్షిత్, మానస, సాయిశివ, ఎస్ఐలు వెంకన్న, నాగుల్‌మీరా, లక్ష్మీ బార్గవి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు తేదీల ఖరారు

ఖమ్మం స్పోర్ట్స్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యాన కొనసాగుతున్న స్పోర్ట్స్ అకాడమీలు, రీజినల్ స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశాలకు తేదీలను ఖరారు చేసినట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సునీల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1న సిద్దిపేటలో వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకు, 10, 11 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో సైక్లింగ్, రెజ్లింగ్ ఎంపికలు, హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికలు జరుగుతాయని వివరించారు. ఇక 10వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీకి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాలీబాల్ అకాడమీకి, 12న వనపర్తిలో హాకీ అకాడమీకి, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. జూన్ 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీకి ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఆయా క్రీడాంశాల్లో జరిగే ఎంపికలకు నిర్ణీత తేదీల్లో వెళ్లాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



ఖమ్మం సహకారనగర్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 3,483 మంది విద్యార్థులకు గాను 3,268 మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 890 మందికి గాను 829 మంది హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 20 పరీక్ష కేంద్రాలను సందర్శించాయని, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని వివరించారు.


వృత్యంతర శిక్షణతో ఉపాధ్యాయులకు మేలు


ఖమ్మం సహకారనగర్ : వృత్యంతర శిక్షణతో ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని స్టేట్ రిసోర్స్ పర్సన్, తెలుగు పర్యవేక్షకులు మడతా భాస్కర్ అన్నారు. నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యా లక్ష్యాల సాధనకు ఈ శిక్షణ సరైందని అన్నారు. శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు పొత్తూరి సీతారామారావు, దేవయ్య, జంగం నాగేశ్వరరావు, జక్కంపూడి కృష్ణ, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

ఎయిడ్స్, లెప్రసీ విభాగాలపై అధికారుల చిన్నచూపు

- సుదీర్ఘ కాలంగా కొరవడిన పర్యవేక్షణ
- 2019 నుంచి 'అదనపు' విధులు నామమాత్రమే
- స్పెషలిస్టులు లేక పెరుగుతున్న కేసులు





ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణపై నిర్లక్ష్యం చోటుచేసుకుంటోంది. ఈ వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా అదనపు జిల్లా వైద్యాధికారి(ఎయిడ్స్ అండ్ లెప్రసీ) విభాగం ఉంటుంది. ఆ పోస్టుకు డిప్లొమా ఇన్ డెర్మటో వెనెరియాలజీ అండ్ లెప్రసీ(డీడీవీఎల్) స్పెషల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులు. అయితే చాలా ఏళ్లుగా ఈ పోస్టుపై నీలినీడలు అలముకున్నాయి. ఎయిడ్స్ అండ్ లెప్రసీ అదనపు జిల్లా వైద్యాధికారి పోస్టులో పనిచేస్తున్న అధికారి దీర్ఘకాలంగా సెలవు పెట్టడంతో ఆ విభాగంపై పర్యవేక్షణ కొరవడుతోంది. 2019 నుంచి సదరు అధికారి డిప్యుటేషన్‌పై పొరుగు జిల్లాలో పనిచేయడం, ఆ తర్వాత వచ్చి మళ్లీ తన పోస్టులో జాయిన్ కావడం, ఆ తర్వాత తరచూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్తుండడంతో ఆ విభాగాన్ని పట్టించుకునే వారు లేరు. కీలకమైన వ్యాధుల కట్టడికి అర్హులైన స్పెషలిస్ట్ వైద్యాధికారి లేకపోవడంతో కేసుల నియంత్రణ సాధ్యం కావడం లేదు.

ఎయిడ్స్ కేసులు పైపైకి..

ఎయిడ్స్ అండ్ లెప్రసీ జిల్లా అదనపు వైద్యాధికారి సాధారణంగా ఎయిడ్స్ కేసులపై నిత్యం పర్యవేక్షించాలి. వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తుండాలి. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు కేసులు పెరగకుండా చూడాలి. కానీ జిల్లాలో గత కొన్నేళ్లుగా ఎయిడ్స్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కేసుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అవగాహన లేమితో యువత హెచ్ఐవీ బారిన పడుతున్నారు. జిల్లాలో ప్రతీ నెల 50 నుంచి 60 పాజిటివ్ కేసులు నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే కాగా అనధికారికంగా కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 17,350 మందికి ఈ వ్యాధి సోకినట్లు ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా గుర్తించారు. అయితే ప్రస్తుతం ఎంతమంది వ్యాధి గ్రస్తులు ఉన్నారు, ఎంత మంది చనిపోయారు అనే సమగ్ర రికార్డులు లేకపోవడం గమనార్హం. కాగా ప్రస్తుతం ఏఆర్‌టీ ద్వారా 6,842 మంది మందులు వాడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని ఏఆర్‌టీ సెంటర్లలో నిత్యం పాజిటివ్ కేసులు వెలుగు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం



ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి సెలవులో ఉన్నది వాస్తవమే. అయినా ఆ రెండు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఓ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. అర్హత గల అధికారి ఉండాల్సి ఉన్నా, కొరతతో ఉన్న వారితోనే వ్యాధి నియంత్రణకు పాటుపడుతున్నాం. ఎయిడ్స్ అండ్ లెప్రసీ అదనపు జిల్లా అధికారి పోస్టులో మరొకరిని శాశ్వతంగా నియమించాలంటే డీహెచ్ నిర్ణయం తీసుకోవాలి.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్ఓ

సర్వే ద్వారానే కుష్టు బాధితుల గుర్తింపు..

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు అదనపు జిల్లా వైద్యాధికారి(ఎయిడ్స్ అండ్ లెప్రసీ) ఆధ్వర్యంలో నిరంతరం లెప్రసీ కాలనీల్లో పర్యటించాలి. ఎక్కడ అనుమానిత కేసులు ఉన్నాయో సిబ్బందితో కలిసి గుర్తించాలి. అయితే 2019 నుంచి ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతీ సంవత్సరం ప్రభుత్వం రెండు వారాల పాటు సర్వే చేస్తుంది. ఆ సమయంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా మచ్చలు ఉన్నాయా, అవి ఎలాంటివి అని పరీక్షిస్తారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తారు. ఆ సమయంలోనే తప్పితే ఆ తర్వాత కుష్టు వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో 2027 నాటికి కుష్టు రహిత దేశంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం

- జూన్ 3 నుంచి గ్రామాలకు రెవెన్యూ అధికారులు
- ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్ : ధరణి చట్టాన్ని రద్దు చేసి ప్రజలు మెచ్చే భూ భారతిని తీసుకొచ్చామని, ఈ చట్టంతో సమస్యలు పరిష్కారం కానున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. భూభారతి చట్టం విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 29 జిల్లాల్లో తాను పర్యటించానని, అన్ని ప్రాంతాల ప్రజలు, రైతులు ఈ చట్టంపై సంతోషంగా ఉన్నారని తెలిపారు. జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు గ్రామాలకు వెళ్తారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇస్తున్నామని, అందులో 1.95 లక్షల మంది లబ్ధిదారులను ఇప్పటికే ఎంపిక చేశామని తెలిపారు. మిగతా 2.55 లక్షల మంది లబ్ధిదారులను ఈ నెలాఖరుకు ఫైనల్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 9,800 చెంచు, చెంచు ఉపకులాల కుటుంబాలన్నింటికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. ఐటీడీఏ ప్రాంతాల్లోని గిరిజనులకు అదనంగా మరో 10వేల ఇళ్లు ఇస్తామన్నారు. జూన్ 2 నాటికి కనీసం 1000 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి ఎవరైనా సిద్ధంగా లేకుంటే వారి నుంచి అంగీకారం తీసుకుని అర్హులైన మరొకరికి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెండో విడత కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, జిల్లాకు 17,983 ఇస్తున్నామని ప్రకటించారు. ఇందులో 12,276 ఇళ్లకు ఆయా నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, ఇప్పటివరకు 7,212 ఇళ్లకు ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం లభించిందని వివరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు లబ్ధిదారుల జాబితా వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేయాలని చెప్పారు.

మండలాల్లో అవగాహన సదస్సులు..

భూ భారతి చట్టంపై పైలట్ మండలంగా నేలకొండపల్లిని ఎంపిక చేసి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, భూ సమస్యలపై 3,264 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 1,786 సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. రెండో విడతగా బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఎర్రుపాలెం మండలం మూలుగుమాడును రీ సర్వేకు పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని చెప్పారు. జూన్ 2 నుంచి అన్ని మండలాల్లో సర్వే కోసం రెండు టీమ్‌ల చొప్పున సిద్ధం చేయాలని సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల వేగవంతానికి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామని, భూ భారతి పైలట్ మండలాల్లో భూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించామని వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షం

- నగటు వర్షపాతం 24 మి.మీ.
- పలుచోట్ల 45 మి.మీ.కుపైగానే..
- మూడు రోజుల పాటు వర్ష సూచన



ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షం కురిసింది. మొత్తంగా 504.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 24 మి.మీ. కాగా అత్యధికంగా వైరాలో 47.4 మి.మీ. చింతకాని, పెనుబల్లి, నేలకొండపల్లి, సత్తుపల్లి మండలాల్లో 40 మి.మీ.కు పైగా నమోదైంది. కల్లూరులో అత్యల్పంగా 8.4 మి.మీ. వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావం, అరేబియా సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. గురువారం 33.4 నుంచి 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పమ్మిలో 38.2 డిగ్రీలు, అత్యల్పంగా గౌరారంలో 33.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రైతులు పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. అయితే ఈ వానలు మరో మూడు, నాలుగు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
వైరా	47.4	ఖమ్మం అర్బన్	19.2
చింతకాని	46.6	ఖమ్మం రూరల్	16.2
పెనుబల్లి	45.2	ఎర్రుపాలెం	15.6
నేలకొండపల్లి	43.6	కొణిజర్ల	12.6
సత్తుపల్లి	42.0	వేంసూరు	10.6
తల్లాడ	33.4	ముదిగొండ,	
కూసుమంచి	33.8	బోనకల్	10.4
మధిర	32.8	తిరుమలాయపాలెం	10.2
కామేపల్లి	26.6	రఘునాథపాలెం,	
సింగరేణి	19.4	ఏన్కూరు	9.8
		కల్లూరు	8.4

రామా.. కనవేమిరా!

- అరకొర వసతులతో అంజన్న మాలధారుల ఇక్కట్లు
- తరలివచ్చిన భక్తులతో భద్రాచలంలో హనుమజ్జయంతి సందడి
- కనీస ఏర్పాట్లు చేయని ప్రభుత్వం.. దాతల స్పందన కూడా కరువే..



హనుమాన్ మాల విరమణ చేస్తున్న అర్చకులు

భద్రాచలం: మాల విరమించేందుకు భద్రగిరి వచ్చిన అంజన్న భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. హనుమాన్ మాలధారులు ఇక్కట్ల నడుమే గురువారం శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. హనుమజ్జయంతికి ప్రభుత్వం, దేవస్థానం ఏర్పాట్లు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో భక్తులు అధిక సంఖ్యలో హనుమాన్ మాల ధరిస్తారు. అయ్యప్ప మాలధారణ తర్వాత హనుమాన్ మాలధారణకే ఎక్కువ ఆదరణ ఉంటుంది. మాలధారులు కొండగట్టు అంజన్న వద్ద, భద్రాచలం శ్రీ సీతారాముల చెంతన ఇరుముడి విరమణ చేసేందుకు ఆసక్తి చూపుతారు. మూడు రోజుల్లో సుమారు 40 వేల మంది భక్తులు భద్రాచలాన్ని సందర్శిస్తారు. భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి తర్వాత హనుమాన్ జయంతికే ఎక్కువ మంది భక్తులు వస్తారని చెప్పవచ్చు. ఈసారి కూడా అధిక సంఖ్యలో అంజన్న మాలధారులు భద్రగిరి వచ్చారు. కానీ ప్రభుత్వం కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం ఆధ్వర్యంలో కేవలం అధికంగా లడ్డూల తయారీ, ప్రత్యేక కౌంటర్ల ఏర్పాట్లు తప్ప ఇతరత్రా ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటు చేయలేదు.

క్యూలైన్లు కిటకిట

తరలివచ్చిన హనుమాన్ మాలధారులతో భద్రగిరి కాషాయవర్ణంగా మారింది. రోడ్లన్నీ సందడిగా మారాయి. శ్రీసీతారామ చంద్రస్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. బుధవారం అర్ధరాత్రి వరకు, మళ్లీ గురువారం తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో మాలధారణ విరమణను అర్చకులు పూర్తి చేశారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం, తమలపాకులతో అర్చన, తదితర పూజలను గావించారు. ప్రసాదాల కోసం శాశ్వత ఆరుకౌంటర్లు, స్టేడియంలో బ్యాంకర్ల ద్వారా నాలుగు, పడమర మెట్ల వైపు మరో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈఓ రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతీ నమస్తుభ్యం..

- పుష్కరాలకు జిల్లా నుంచి తరలివెళ్తున్న భక్తులు
- నదీస్నానం పుణ్యఫలమని నమ్మకం
- ఆ తర్వాత కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం



నదీస్నానం చేసి పూజలు చేస్తున్న మహిళా భక్తులు



కాళేశ్వరంలో శివుని సెట్టింగ్

ఖమ్మంగాంధీచౌక్: సరస్వతీ పురష్కరాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వెళ్తున్నారు. ఈనెల 15న ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతీ నది ప్రవహిస్తోంది. ఈ త్రివేణీ సంగమంలో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తుండగా.. ఇక్కడ స్నానమాచరించిన భక్తులు పక్కనే ఉన్న ముక్తేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటున్నారు.

నదీ స్నానాలకు ప్రాముఖ్యం

సరస్వతీ పుష్కరాల్లో నదీ స్నానాలకు భక్తులు ప్రాధాన్యత ఇస్తున్నారు. పుష్కరస్నానం పుణ్యఫలమని, చదువుల తల్లిగా విరాజిల్లుతున్న సరస్వతీ నదిలో స్నానమాచరిస్తే సకల విద్యలు ప్రాప్తిస్తాయని వారి నమ్మకం. కాళేశ్వరంలో స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్నానానంతరం భక్తులు నదీ తీరంలో సైకత లింగాలను ఏర్పాటు చేసి పూజలు చేయడంతో పాటు పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్నారు.

వివిధ మార్గాల్లో పయనం..

జిల్లాలోని అన్ని ప్రాంతాల భక్తులు నిత్యం పుష్కరాలకు వెళ్తున్నారు. ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో వరంగల్, పరకాల, భూపాలపల్లి మీదుగా కాళేశ్వరం వరకు 225 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఖమ్మం నుంచి మహబూబాబాద్, నర్సంపేట, మల్లంపల్లి, రేగొండ, భూపాలపల్లి, మహదేవ్‌పూర్ మీదుగా వెళితే 221 కి.మీ. ఉంటుంది. లేదంటే రైలులో ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాళేశ్వరం వెళ్లొచ్చు.

ట్రావెల్స్ చార్జీల మోత..

జిల్లా నుంచి కాళేశ్వరానికి నేరుగా బస్సుల సౌకర్యం అంతగా లేకపోవడంతో భక్తులు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కొందరు భక్తులు పుష్కరాలతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న కొండగట్టు, ధర్మపురి, వేములవాడ, లక్నవరం, రామప్ప, వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారి దేవాలయం వంటి క్షేత్రాలను సందర్శిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి రవాణా చార్జీలు రూ.1,200 నుంచి రూ. 2,000 వరకు ఖర్చవుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్లు, సెలవులు కావడం, ఇప్పుడే పుష్కరాలు రావడంతో ప్రైవేట్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ధరల మోత మోగుతోంది.

ముక్తిని కలిగించేది పుణ్య స్నానం



సరస్వతీ పుష్కరాలకు కుటుంబమంతా వెళ్లొచ్చాం. త్రివేణీ సంగమంలో స్నానమాచరించి సరస్వతీ అమ్మవారిని, ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నాం. అయితే సౌకర్యాలు ఆశించినంతా లేవు. తినుబండారాల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి.

– వల్లాల స్వప్న, రిక్కాబజార్, ఖమ్మం

సమూహంగా వెళ్లేందుకు ఏర్పాట్లు



కాలనీ వాసులం, కుటుంబ సభ్యులం కలిసి పుష్కరాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాం. నేరుగా బస్సులు లేక పోవడంతో ట్రావెల్స్ వాహనం మాట్లాడుకున్నాం. ట్రావెల్స్ ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

– కొండపల్లి మనోహరి, శ్రీనివాసనగర్, ఖమ్మం

వాహనాలకు డిమాండ్ పెరిగింది



పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లేందుకు వాహనాల బుకింగ్‌లు పెరిగాయి. ఓ వైపు పెళ్లిళ్ల సీజన్, మరో వైపు వేసవి సెలవుల సమయంలో పుష్కరాలు రావడంతో వాహనాలకు డిమాండ్ పెరిగింది. దూరం, వాహనాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నాం.

– ఆర్ ప్రకాష్, ట్రావెల్స్ యజమాని, ఖమ్మం

ప్రైవేట్ ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ చేయించాలి

ఖమ్మంవైద్యవిభాగం : జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి అన్నారు. తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల చట్టం (1994)అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, ఇమేజింగ్ సెంటర్లు కూడా పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్వాలిఫైడ్ రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, సోనోలాజిస్టులు మాత్రమే గర్భిణులకు స్కానింగ్ నిర్వహించాలన్నారు. ఆస్పత్రుల్లో వారు లేకుంటే నేరంగా పరిగణిస్తామని పేర్కొన్నారు. స్కానింగ్ రిపోర్టులను ప్రతి నెల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా సమర్పించాలని సూచించారు. జిల్లాలో మొబైల్ స్కానింగ్ సెంటర్లను నిషేధించామని, అలాంటి సెంటర్ల సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆడపిల్ల స్వేచ్ఛగా పుట్టేలా, పెరిగేలా, చదివేలా, స్వయం శక్తితో ఎదిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు బి.సైదులు, సీతారాం, గైనకాలజిస్ట్ యామిని, సుబ్రహ్మణ్యం, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సంఘం కమిటీ ఎన్నిక


అధ్యక్షుడు మారగాని లక్ష్మీనారాయణ


ప్రధాన కార్యదర్శి శ్రావణి నాయుడు

నేలకొండపల్లి: ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మారగాని లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా ఆయన నియమితులయ్యారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా కె.శ్రావణినాయుడు, కోశాధికారిగా వై.సూరయ్య, ఉపాధ్యక్షుడిగా వి.వీరన్న, సంయుక్త కార్యదర్శిగా పి.నరేష్, గౌరవ సలహాదారులుగా నరేష్, కృష్ణయ్య, మహేష్, చంద్రావతి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎం.శివకుమార్, రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రత్యేక ఉపాధ్యాయలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు, హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు.

బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ


మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, వైద్యులు పేషంట్లతో వ్యవహరిస్తున్న తీరు, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నాక సమయపాలన విధిగా పాటించాలన్నారు. అలాగే పేషంట్‌లతో మర్యాదగా వ్యవహరించాలని, లాబ్ పరీక్షలు నిర్వహించాలని, మందులు సరిపడా అందించాలని, అసంక్రమిత వ్యాధులపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. మలేరియ, డెంగీ, కేన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్, టీబీ వ్యాధిగ్రస్తులకు మంచి సేవలతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించి ఆరోగ్యవిద్యను అందించాలని సూచించారు.

విద్యుత్ అభివృద్ధి పనుల పరిశీలన


సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: దానవాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో, రైల్వే అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను గురువారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ అధికారుల బృందం పరిశీలించింది. మేకల భిక్షమయ్య ఫంక్షన్ హాల్ నుంచి కామంచికల్ వరకు జరుగుతున్న రహదార్ల అభివృద్ధి పనులకు సంబంధించి విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులతో పాటు కామంచికల్‌లో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఖమ్మం టౌన్ డీఈ నంబూరి రామారావు, రఘునాథపాలెం ఏడీఈ సంజీవ్ పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీ బదిలీ


అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం: ఖమ్మం అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఎ.నరేష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా ఏఎస్పీ(అడ్మిన్)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాదిన్నర క్రితం ఖమ్మం అడిషనల్ డీసీపీగా బదిలీపై రాగా.. ప్రస్తుతం ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కాగా, మున్నేరు వరదల సమయాన ప్రజలకు సేవలు అందించి గుర్తింపు పొందారు.

రామయ్య సేవలో మాజీ స్పీకర్


స్వామివారి సన్నిధిలో మధుసూదనాచారి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి గురువారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నేత ఎనుగుల రాకేష్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మానె రామకృష్ణ, మండల కన్వీనర్ సునీల్ పాల్గొన్నారు.

ఫలరాజు ఫలించేలా..

యాజమాన్య పద్ధతితో అధిక లాభాలు

- నేల సారవంతానికి దుక్కులు అవసరం
- కొమ్మ కత్తిరింపులతో తెగుళ్ల నివారణ
- వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్


మామిడి తోట

వైరా: దేశంలో పండించే పండ్ల తోటల్లో ప్రధానమైనది, ఫలరాజుగా పేరుగాంచినది మామిడి. అయితే దీని సాగు విస్తీర్ణం దేశంలో మొత్తం 35శాతం ఉండగా.. 22,58,130 హెక్టార్లలో విస్తరించి ఉంది. రాష్ట్రంలో 1,15,990 హెక్టార్లు, జిల్లాలో 13,674 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. సాధారణంగా మామిడి రైతులు పూత, కాత దశలో మాత్రమే మామిడి తోటలపై దృష్టి సారించి చెట్టుకు కావాల్సిన ఎరువులు అందిస్తుంటారు. దీని వలన సరైన పోషకాలు అందక పూత సకాలంలో రాకపోవడం, వచ్చిన పూత, పిందె సరిగా నిలవక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యాన అధిక దిగుబడులు సాధించేందుకు కోత అనంతరం కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచిస్తున్నారు.

కొమ్మ కత్తిరింపులు..

- మామిడి కాయ కోత అనంతరం కాయ తొడిమలున్న కొమ్మలు, ఎండిన కొమ్మలు, తెగులు సోకిన, విరిగిన కొమ్మలు, చెట్ల లోపల గాలి, వెలుతురు ప్రవేశానికి అడ్డుగా ఉన్న కొమ్మలను కత్తిరించాలి.
- పూత కాడల నుంచి వెనుకకు 15 సెంటీ మీటర్లు వరకు కత్తిరిస్తే నవంబర్, డిసెంబర్‌లలో కొత్త కొమ్మలు పుట్టుకొచ్చి, అవే వచ్చే రుతువులో పుష్పిస్తాయి.
- ప్రతీ రెమ్మ చివరి నుంచి 3–5 చిగుర్లు వస్తే ఆరోగ్యంగా ఉన్న రెండింటిని నిలుపుకొని మిగిలిన వాటిని తీసివేయాలి.
- కత్తిరింపులతో కొంత మేర తెగుళ్ల తగ్గే అవకాశం ఉండగా.. కత్తిరించిన కొమ్మ భాగాలకు బోర్డ్‌ఫేస్ట్ పూయాలి లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి.

దుక్కి దున్నడం..

తొలకరిలో అనగా జూన్, జూలై మాసాలలో రైతాంగం చెట్ల మధ్యన దున్నాలి. దీని వలన కోశస్థ దశలో ఉన్న పురుగులు, కలుపు నివారించబడడంతో పాటు నేల గుల్లబారి, వేర్లకు గాలి బాగా చేరి చెట్టు ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుంది. అదేవిధంగా నేలకు వర్షపు నీటిని పట్టి ఉంటే గుణం పెరిగి నేల సారవంతమవుతంది. మూడవ దుక్కి అక్టోబర్‌లో చేపడినట్లయితే నేలలో తేమ ఆరిపోయి సకాలంలో పూత రావడానికి దోహదపడుతుంది. దున్నేటప్పుడు చెట్టు నుంచి 1–5 మీటర్ల దూరంలో దున్నడం ఉత్తమం.

ఎరువుల యాజమాన్యం..

- కాసే తోటలో చెట్లకు సరిపైన మోతాదులో ఎరువులు అందించాలి. ఒక సంవత్సరం వయసున్న చెట్లకు 10 కిలోల పశువుల ఎరువు, 200 గ్రాములు యూరియా, 600 గ్రాములు సింగిల్ సూపర్ పాస్పేట్, 150 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి.
- అదే ఐదేళ్ల వయసున్న చెట్లకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో యూరియా, 3 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 730 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి.
- పదేళ్లు, ఆపై వయసు గల చెట్లకు 100 కిలోల పశువులు ఎరువు, 2.2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 1.75 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- మామిడి కోత అయ్యాక సిఫార్సు చేసిన 2/3 వంతు ఎరువులను వేయాలి. మిగతా 1/3 భాగం ఎరువులను కాయ ఎదుగుదల దశలో ఫిబ్రవరి రెండవ లేదా మూడవ వారంలో వేయాలి. సూక్ష్మధాత లోపాలు ఎక్కువగా ఉన్న తోటల్లో చెట్టుకు 150 గ్రాములు జింక్ సల్ఫేట్, 75 గ్రాములు బోరాక్స్, 100 గ్రాములు ఫెర్రస్ సల్ఫేట్ 125 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ పశువుల ఎరువుతో కలిపి జూన్, జూలై మాసాలలో మొక్కల పాదుల్లో వేయాలి. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మామిడి చెట్లు సెప్టెంబర్, అక్టోబర్‌లో కొత్త చిగుర్లు వేసి సకాలంలో పూత రావడమే గాక మంచి దిగుబడులు పొందవచ్చు.

జాతీయవాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమే..


కేంద్రమంత్రికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మంవన్‌టౌన్: జాతీయవాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల నగరంలో జాతీయవాదుల నేతృత్వాన నిర్వహించిన తిరంగా యాత్రను కొంతమంది అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘటనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వర రావు నేతృత్వాన జిల్లా నేతలు కరీంనగర్‌లోని బండి సంజయ్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించగా.. ఆయన స్పందించారు.ఇలాంటి దేశద్రోహకర చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు సన్నే ఉదయప్రతాప్, రమేష్, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వర రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుక్ చేసుకుని పడిగాపులు


కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

నేలకొండపల్లి: స్లాట్ బుక్ చేసుకున్న రైతులు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాశారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల స్లాట్ బుక్ రైతులకు గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పించారు. దీంతో వారు తమ చంటి పిల్లలతో సహా ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకోగా.. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో రాత్రి 9 గంటల వరకు కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. తిండి తిప్పలు లేకుండా కార్యాలయంలో వేచి ఉన్న రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దర్ వి.వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ఖమ్మంలో జిల్లా అధికారులతో సమావేశం ఉన్నందున్న ఆలస్యమైందని వెల్ల డించారు.

సుకినీతండాలో మూగ గోస..

నాలుగు ఆవుల మృతి


అనుమానాస్పదంగా మృతి చెందిన ఆవు

రఘునాథపాలెం: మండలంలోని సుకినీతండాలో అనుమానాస్పద స్థితిలో పలువురు రైతులకు చెందిన నాలుగు ఆవులు గురువారం మృతి చెందాయి. బుధవారం మేతకు వెళ్లిన పశువులు రాత్రి నుంచి తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. గమనించిన రైతులు వెంటనే చికిత్స చేయించినా ప్రయోజనం లేకుండా మాలోతు బద్యా, జగ్యా, రవి, సీతులకు చెందిన నాలుగు ఆవులు మృతి చెందాయి. అదేవిధంగా గ్రామానికి చెందిన వీరా, శంకర్, రవిలకు చెందిన మరో మూడు ఆవులు తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతుండగా.. పాపటపల్లి పశువైద్యాధికారి గంగాధర్ ఆధ్వర్యాన వైద్యసిబ్బంది చికిత్స అందిస్తున్నారు. మేతకు వెళ్లిన సమయాన పొలాల్లో పురుగు మందుల డబ్బాలు, గాబుల్లో వర్షపు నీరు నిలిచి ఉండగా, అవి తాగిన కారణంగానే పశువులకు ఇలా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైన వేళ పశువుల మృతితో రైతు కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయి. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

డీఎస్పీ సేవలకు గుర్తింపు

కొత్తగూడెంఅర్బన్: పోక్సో కేసులో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కేసుల పరిష్కారానికి కృషి చేసిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌కు గుర్తింపు లభించింది. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌కు ప్రశంసాపత్రం లభించగా.. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో గురువారం డీఎస్పీని అభినందించారు.

బావిలో పడి ఆవు, రెండు దూడలు మృతి


జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

చింతకాని: మేత కోసం అడవికి వెళ్లిన ఆవు, రెండు దూడలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన చింతకానిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. చింతకాని గ్రామానికి చెందిన బండి సతీష్‌కు చెందిన ఆవు, ఉసికల తుమ్మలయ్యకు చెందిన పెయ్య దూడ, గద్దం రాఘవులకు చెందిన కోడె దూడలను మూడు రోజుల క్రితం మేత కోసం అడవికి పంపించారు. చింతకాని నుంచి రేపల్లెవాడ వెళ్లే రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన ఆవు, రెండు దూడలు అందులో పడి మృతి చెందాయి. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో మూడు రోజుల నుంచి వాటి కోసం వెతుకుతుండగా.. గురువారం సాయంత్రం స్థానిక రైతులు చూసి సమాచారం ఇవ్వడంతో వాటిని జేసీబీ సాయంతో బయటకు తీశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో బుధవారం రాత్రి ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడగా.. పాడి గేదె మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తెల్ల బోయిన శ్రీనుకు చెందిన గేదె గురువారం ఉదయం మేతకు వెళ్లగా.. అప్పటికే తెగిపడిన తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందిందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతుల వాపోయాడు. కాగా, ఘటనా స్థలాన్ని మండల మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి పరిశీలించి బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


మృతి చెందిన పాడి గేదె

ఆటో బోల్తా.. మహిళ మృతి

రఘునాథపాలెం: ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. పువ్వాడనగర్‌కు చెందిన రాజులపాటి జయలక్ష్మి అలియాస్ జయమ్మ (55) రెండు రోజుల క్రితం తన కుమార్తె, అల్లుడు, మనుమడు, మనుమరాలితో కలిసి ఆటోలో ఖమ్మానికి వెళ్లింది. బ్యాంక్ రుణం చెల్లించి ఇంటికి తిరిగి వస్తుండగా.. రహదారి విస్తరణ పనుల నేపథ్యాన పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో జయమ్మ తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందగా.. బంధువుల ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో మిగిలిన కుటుంబసభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న జయలక్ష్మి భర్త సాంబయ్య గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. ఏడాది కాలంలోనే దంపతులు ఇద్దరు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాలీ ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: ట్రాలీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటనలో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. ఈ నెల 19న రాత్రి మండల పరిధి లక్ష్మీదేవిపల్లి బీసీఎం జాతీయ ప్రధాన రహదారి పక్కన మెకానిక్ షాపువద్ద ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేస్తున్న ఆసీఫ్, దంతలబోరు గ్రామానికి చెందిన పోలేబోయిన రాజారావు, చెరుకు శ్రీనులను పాల్వంచ వైపు వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయలు కాగా ఖమ్మంకు తరలించారు. పోలేబోయిన వీర్రాజు ఫిర్యాదు మేరకు ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా లింగపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ కంచర్ల కృష్ణయ్యపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

పందెంరాయుళ్లపై..

దమ్మపేట: కోడి పందేలు నిర్వహిస్తున్న పందెంరాయుళ్లపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దిబ్బగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపాన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారేపల్లి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన బానోత్ లాల్‌సింగ్, ఇల్లెందు మండలం జింకలతండా గ్రామానికి చెందిన బానోత్ సుప్రజ ఇరువురు బైక్‌పై కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు ఖమ్మంకు సిఫారసు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దండకారణ్యం నారాయణపూర్, బస్తర్‌లో బుధవారం జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, ప్రజా సంఘాల నేతలు కాకి భాస్కర్, డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్ మాట్లాడారు. మూడు నెలలుగా మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణ ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరుపుతూనే ఉందన్నారు. శాంతి చర్చలకు రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపినా 2026 మావోయిస్టు రహిత దేశంగా మార్చుతామని కేంద్రం అమాయకులను పొట్టనబెట్టుకుంటుందన్నారు. తాజాగా జరిపిన ఎన్‌కౌంటర్ మధ్య భారతదేశంలో ఉన్న ఖనిజ సంపదను గుజరాత్ మార్వాడీలకు దోచిపెట్టే కుట్రలో భాగమే ఈ ఎన్‌కౌంటర్‌లు అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ 23న సాయంత్రం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు వై.విక్రమ్, సింగు నర్సింహారావు, సీ.వై.పుల్లయ్య, రవి మారుత్, దేవిరెడ్డి విజయ్, చిర్ర రవి, విప్లవ కుమార్, రమణాల లక్ష్మయ్య, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల యాత్ర విజయవంతం కావాలి


బస్సుయాత్రను ప్రారంభిస్తున్న సీఐ కరుణాకర్

ఖమ్మం మామిళ్లగూడెం: కాళేశ్వరం శ్రీ సరస్వతి పుష్కరాలకు వెళ్తున్న బస్సు యాత్ర విజయవంతం కావాలని ఖమ్మం వన్‌టౌన్ సీఐ తాటిపాముల కరుణాకర్ కోరారు. గురువారం ఖమ్మం జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్‌తో పాటు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పుష్కరాలకు వెళ్తుండగా.. ఖమ్మం గాంధీ పార్క్ నుంచి వెళ్లే బస్సును సీఐ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడాక..సీఐను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి, జయ, సభ్యులు అనాసి రాధాకృష్ణ, సాదినేని జనార్ధన్‌రావు, రాయల వెంకటేశ్వర్లు, వేగినాటి లక్ష్మయ్య, కేదాసు నరసయ్య, కె.సత్యనారాయణరెడ్డి, శ్రీహరి, జల్లా వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లక్ష్మి, రమాదేవి, నాగమణి, లలిత, పద్మ, శ్రీలక్ష్మి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బావమరిదిని దించేందుకు వెళ్లి అనంతలోకాలకు..

డీసీఎం వ్యాన్ ఢీకొని తండ్రీకొడుకులు మృతి


రాంబాబు(ఫైల్)


క్రిశాంత్(ఫైల్)

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్‌నగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రాంబాబు(28) అతడి కుమారుడు క్రిశాంత్(6) మోటార్ సైకిల్‌పై తల్లాడ వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో ఎన్టీఆర్‌నగర్ వద్ద జాతీయ రహదారిలో ఎదురుగా సత్తుపల్లి నుంచి తల్లాడ వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రిశాంత్ అక్కడికక్కడే మృతి చెందగా రాంబాబును 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

బావమరిదిని బస్టాండ్‌లో దించేందుకు వెళ్లి..

కొత్తపల్లి రాంబాబు తన భార్య గోపరాణి పిల్లలతో పాటు అత్తగారు ఊరైన రామచంద్రాపురం గ్రామానికి బుధవారం రాత్రి వచ్చారు. రాత్రి అక్కడే బస చేసి గురువారం మధ్యాహ్నం తన బావమరిది తిరుపతిరావును తల్లాడ బస్టాండ్‌లో దించేందుకు మోటార్ సైకిల్‌పై వచ్చారు. బావమరిదిని దించేందుకు వస్తుండగా తన కుమారుడు క్రిశాంత్ నేను కూడా వస్తానని అనడంతో కుమారుడితో పాటు బావమరిదిని తీసుకొని బస్టాండ్‌లో దించి తిరిగి రామచంద్రాపురం బయలు దేరాడు. ఈక్రమంలో డీసీఎం వ్యాన్ ఢీకొట్టగా తండ్రీకుమారుడు మృతి చెందగా.. గ్రామంలో విషాదం అలుముకుంది.

మహిళ మృతిపై ఫిర్యాదు

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన రాజబోయిన విజయ లక్ష్మి (27) బుధవారం అర్ధరాత్రి ఉరివేసుకుని మృతి చెందింది. అయితే ఆమె మృతికి సోదరుడైన అరకల నాగరాజు అనుమానం వ్యక్తం చేస్తూ గురువారం కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: మహిళ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ కె.తిరుమలరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జె.క్రిష్ణ కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ.7.99 లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కులను గురువారం సీపీ సునీల్‌దత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

సైనిక కుటుంబాలకు ఆర్థిక సాయం


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఖమ్మంరూరల్: భారత్ – పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో అమరులైన భారత సైనికుల కుటుంబాలకు ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వారు గురువారం చెక్కు అందించగా కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అదాలత్ నరేందర్, నూనావత్ కిషన్, ఎస్కే జానీ, వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరెడ్డి, ఊట్ల రఘు, గోవిందు, భద్రం, వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.